ఓంశ్రీసాయిరాం

సయీసప్తకము

రామాయణంబు వ్రాయ వాల్మీకియై
        పుట్టపర్తిలోపలనుండి పుట్టుకతన
తన శివమూర్తి భూషణములౌ సర్పాలు
        పుట్టలోనే వృద్ధి పొందుకతన
శ్రీనివాసుండయి తాను పెక్కు దినాలు
        పుట్టలో కాలమ్ము బుచ్చుకతన
పాలారగింప సుబ్రహ్మణ్య మూర్తియై
        పుట్టలో కాపురమ్ముండుకతన
పుట్టలేని స్వామి పుణ్యాల పుట్టయౌ
పుట్టపర్తిలోన పుట్టినాడు
పుట్టమీద ప్రేమ పోలేదు స్వామికి
పుట్టపర్తి పరమ పుణ్యమూర్తి.

నవ్వునప్పుడు కరుణాసింధువగు బుద్ధ
        భగవాను భంగి కన్పట్టు స్వామి
హస్తమ్ము కదలించునప్పుడు శ్రీకృష్ణ
        పరమాత్మ కరణి కన్పట్టు స్వామి
నడచునప్పుడు జగన్మాత మహాదుర్గ
        పరశక్తి పగిడి కన్పట్టు స్వామి
కడకంట గాంచినప్పుడు ప్రేమనిధి క్రీస్తు
        ప్రభువు చందమున కన్పట్టు స్వామి
లీల తలయూచి జగతి పాలించువేళ
పరమశివుని విధాన కన్పట్టు స్వామి
పలుకునప్పుడు సకలదైవస్వరూప
వేదపురుషుని క్రియ కన్పించు స్వామి

కన్నీళ్లతో కాల్చు కడుగబోన్ మునుముందె
        గంగ నీ పాదాలు కడుగుచుండె
తీయతీయని పండ్లు తినిపింతమని రాగ
        శబరి నాముందు సాక్షాత్కరించె
మాలతీమాల నీమౌళి గ్రైసేయబోన్
        నెలవంక జడలలో వెలుగుచుండె
స్వామి పాదుకలు సంస్పర్శింతమనుకొన్న
        తొలినాడె భరతుడెత్తుకొని పోయె
పట్టుకుచ్చుల ఛత్రమ్ము పట్టబోవ
ఆదిశేషుని శీర్షంబు లడ్డువచ్చె
ఎట్లు నీ సేవ చేయుటో ఎఱుకపడక
తరుగుచుంటి ప్రశాంతిమందిరము చుట్టు.

ఆకు కోసిన వృక్షమాకుల పడునేమొ
        ఇదె 'తనూపత్ర' మర్పింతు స్వామి!
పూలు తెంచిన లతల్ జాలి చెందునో యేమో
        ఇదె 'మనఃపుష్ప' మర్పింతు స్వామి!
ఫలము త్రుంచిన రామచిలుకేమి యలుగునో

ఇదె 'కర్మఫలము' నర్పింతు స్వామి!
తోయంబు గొన నదీకాయంబు కలగునో
ఇదె 'భాష్పతోయ' మర్పింతు స్వామి!
పత్రమో పుష్పమో మఱి ఫలమొ జలమొ
లోటురానీయనున్నంతలోన స్వామి!
ఒకరి వస్తువులడిగి తేనోపగాని
'నాది' యన్నది సర్వమ్ము నీదె స్వామి!!

అల కుచేలుని అటుకులు రుచియో! బోయ
కన్నప్ప యిడు వంటకములె రుచియో!
యమధర్మరాజు పక్షమె కఠోరమొ! కాక
కాళియు శీర్షమే కర్కశంబో!
వెండికొండ నొనర్చు తాండవమ్ము సుఖమ్మొ!
పాలమున్నీటిపై పడక సుఖమొ!
పూతనాస్తనపయః పూర్వమ్ము కడుచేదో!
కాలకూట విషమ్మె కటికచేదో
సందియముకల్గె భక్తుల డెందమందు
వాస్తవము దెల్పి మా శంక బాపు స్వామి
హరిహరాద్వైతమూర్తి! శ్రుత్యంతవర్తి!
సత్యసాయి జగద్గురు చక్రవర్తి!!

కొందరు 'విష్ణుమూర్తి' వను కొంధరు 'శ్రీ శివశక్తియంచు వా
కొందరు కొంతమంది; మరికొందరు 'శ్రీ రఘురామచంద్రుదే'
యందురు; చిత్కళా విభవదా! శివదా! భవదాత్మ సత్యని
ష్యందమొ! ధర్మసమ్మితమొ! శాంతమొ! ప్రేమసుధా ప్రపూర్ణమో!!

చారుతరమ్ము 'సత్యము' ప్రచారమటే! పరమార్థ 'ధర్మ' మా
చారమటే! నితాంతమగు 'శాంతి' స్వభావమటే! ప్రసన్నగం
భీర శుచిస్మితంబయిన 'ప్రేమ' స్వరూపమటే! 'అహింస' యే
హారమటే! 'ప్రశాంతినిలయం' బిది స్వామికి ఆలయంబటే!!

.................................................................................................................................

సత్యత్రయి

వందే సుందర మందహాస వదనం కారుణ్య వారాంనిధిం
భారద్వాజ పవిత్ర గోత్ర భువ మాపస్తంబ సూత్రం ప్రభుం
ఉద్యద్భాను మరీచి మండల రుచిం ప్రేమ స్వరూపం శివం
శాంతి శ్రీ వలయం ప్రశాంతినిలయం 'సత్యం' 'శివం' 'సుందరం'॥
కస్తూరీ తిలకం కోపలఫలకే, మౌళౌ జటా మండలం,
జిహ్వాగ్రే సకలాః, కలాః, కరతలే భూతిం, కరే కల్పకం
సర్వాంగే అరుణాంశుకంచ, కలయన్ కంఠే సుధా మాధురీం,
పుణ్యస్త్రీ పరివేష్టితో, విజయతే, శ్రీ సత్యసాయీ ప్రభుః॥
పుణ్యోల్లాసిని పుట్టపర్తి నగరే చిత్రావతీ ప్రాంగణే
మోక్షశ్రీ వలయే ప్రశాంతినిలయే సద్భక్త సంఘైస్సహ
'హే స్వామిన్! భగవన్! జగత్రయ విభో! హే సత్యసాయిప్రభో
మా పాహి' తివదన్ క్షణానివ దినాన్ నేష్యత్యహో భాగ్యవాన్॥

.................................................................................................................................

ప్రభుపంచకము

అత్యం మధురాకారం నృత్యంతం సత్యసంక్రాంతం।
శ్రుత్యంతం సత్యసంక్రాంతం నిత్యం తం సాయినం భజే॥
సౌందర్యసార సర్వస్వం మందస్మిత మనోహరం।
వందారు జనమందారం వందే సాయిమహేశ్వరం॥
ఆర్తబంధుం దయాసింధుం కీర్తస్ఫూర్తిప్రదం ప్రభుమ్।
మూర్తిమత్ప్రేమ సామ్రాజ్యం పర్తీశ్వ ముపాస్మహే॥
తరుణారుణ సంకాశం కరుణా వరుణాలయం।
ప్రశాంతినిలయావాసం ప్రాశాంతవదనం భజే॥
సర్వవేదాంత సంవేద్యం సర్వధర్మ స్వరూపిణం।
సర్వదేవాత్మకం సర్వజ్ఞం సత్యసాయినం॥

..............................................................................................................

శ్రీచరణాలు

నమామి విశ్వప్రభు భక్త మండలిం స్మరామి సత్యప్రభు రూప మవ్యయమ్।
వదామి సాయిప్రభు నామ పావనం భజామి పర్తిప్రభు పాద పంకజమ్॥
అవతరణాలు శాంతికి, జయంతికి జాగరణాలు, సత్యమున్
శివమును సుందరంబయిన సృష్టికలంకరణాలు, దీనమా
నవుల యరిష్టకష్టహరణాలు, యుగాభరణాలు, లోకబాం
ధవ కిరణాలు, సాయి చరణాలు సదా శరణాలు మీకగున్.
అచ్చు నీలిమబ్బు తెరకావల ఇంద్రధనుస్సు మెట్లపై
వచ్చుచున్న సూర్యభగవానుని భంగి రసార్ద్రమూర్తియై
పచ్చల నీలిరంగు తెర ప్రక్కలకొత్త మెరుంగు మెట్లపై
వచ్చెడు సత్యసాయి భగవాను పదమ్ముల నాశ్రయించెదన్.
పూర్ణచంద్రహాలు స్వర్ణసోపానాలు
పుణ్యమెంత రాసి పోసికొనెనొ;
సేదదీర స్వామి పాదాలు ముద్దాడి
పులకరించు! సిరులు తొలకరించు!
కాబోలు నివి వియద్గంగా తరంగణీ
పుణ్యప్రవాహాల పుట్టినిండ్లు,
కాబోలు నియ్యవి కాళీయ మౌళీయ
భరతనాట్య ప్రియంభావుకములు,
అవును కాబోలు నియ్యవి దివి భువి కొల్చి
విల్చుకొన్నట్టి త్రైవిక్రమములు,
కాబోలు ఉపనిషత్కామినీ సీమంత
సిందుర రాగరంజితములివ్వి,
ఇవియె కాబోలు మునిమనో భృంగములకు
చవులు పుట్టించు సౌందర్య సరసిజములు,
అవునివే శంఖచక్రరేఖాంకితములు
ఆపదలు బాపు మన స్వామి శ్రీపదములు!!
ఉదయశ్రీ రసోల్లాసా విజయశ్రీ విరాజితా
కరుణశ్రీ ధురీణా తే చరణశ్రీ ర్విరాజితా!!